క్లుప్తంగా

నేడు గురుపౌర్ణమి పూజలు

మాడుగుల రూరల్ : ఆషాడ శుద్ధ గురు పౌరణమి సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గల షిర్డిసాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం నుంచి పూజలు, అర్చనలు, నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు రాపేట రామకొండలరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు నవకలశ స్నపనం, పంచామృత అభిషేకాలు, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరుగుతుందని ఆయన తెలిపారు.

పాఠశాలల సమీపాల్లో ఖైనీ, గుట్కాలు అమ్మరాదు



ఎ.కోడూరులో షాపుల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

కె.కోటపాడు : ఎ.కోడూరు, కె.కోటపాడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గల పాఠశాలలు, కళాశాలల సమీపాల్లో గల పాన్‌షాప్‌లలో పొగాకు ఉత్పత్తులు, ఖైనీ, గంజాయి గుట్కాలను అమ్మకాలను చేపట్టరాదని ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ అన్నారు. ఎ.కోడూరు హైస్కూల్ పరిసరాల్లో పాన్‌షాప్‌ల నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. షాప్‌లలో వీటి అమ్మకాలపై తనిఖీలు జరిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్లు దూరంలో వీటి అమ్మకాలు చేయరాదని తెలిపారు. హెచ్చరికలను ధిక్కరించి అమ్మకాలు చేసే వారిపై కఠిన శిక్షలను అమలు చేయనున్నట్టు ఎస్‌ఐ హెచ్చరించారు.

మేళాను విజయవంతం చేయండి

నర్సీపట్నం: నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 11న వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వ్యవసాయ యాంత్రీకరణ మేళాను విజయవంతం చేయాలని ఏవో ఎస్.విజయలక్ష్మి రైతులకు పిలుపునిచ్చారు. బుధవారం ధర్మసాగరం సచివాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాంత్రీకరణతో సాగు పెట్టుబడులను తగ్గించుకోవచ్చన్నారు. వివిధ రకాల పరికరాలను మేళాలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రైతులు యంత్రాలపై అవగాహన పెంచుకోవాలని, వ్యవసాయ యంత్రాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తుందని అన్నారు.

గ్రామాల పురోగతికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

దేవరాపల్లి: గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎస్. మంజులవాణి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్ఏ) వార్షిక యాక్షన్ ప్లాన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. యాక్షన్ ప్లాన్ తయారీపై సలహాలు, సూచనలు చేశారు.

ఘనంగా మోదమాంబ పండగ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మాడుగుల రూరల్ : వంటర్లపాలెం గ్రామ ఆరాధ్య దైవం మోదమాంబ అమ్మవారి పండగ బుధవారం తెల్లవారుజాము వరకు ఘనంగా నిర్వహించారు. తాచేరు నది ఒడ్డున్న గల అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారిని స్థానిక సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావుతో పాటు గ్రామస్తులు, కూటమి నాయకులు, దర్శించుకున్నారు. రాత్రికి సతకంపట్టు వద్ద ఉరేగింపుగా అమ్మవారి ప్రతిమలను తీసుకుని వెళ్లి పూజలు నిర్వహించారు. స్థానిక పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. థింసా నృత్యం, నేల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ట్రస్టు చైర్మన్ రామారావు

దేవరాపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎ.కోడూరుకు చెందిన దొగ్గ మల్లమ్మ చారిటబుల్ ట్రస్టు తరపున నోట్ పుస్తకాలను వితరణ చేశారు. మండలంలోని పాతవాలాబు, బుచ్చంపాలెం, రేగులబంద, శంభువానిపాలెం పాఠశాలల విద్యార్థులకు ట్రస్టు చైర్మన్ దొగ్గ రామారావు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పాతవాలాబు ప్రధానోపాధ్యాయుడు కె.దండుమునాయుడు, ఉపాధ్యాయులు యర్ర అప్పారావు, శ్రీను, లక్ష్మి, ఏపీటీఎఫ్ జనరల్ సెక్రటరీ సింహాచలంనాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వరలక్ష్మి, జనార్ధన్, దొర, సన్యాసిరావు, బాణం రాంబాబు, పి.రాంబాబు పాల్గొన్నారు.

స్మార్ట్‌గా విద్యుత్ వాత...



కొత్తగా ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

- **స్మార్ట్ మీటర్లతో జనానికి కష్టాలు**
- **బిల్లులు తడిసిమోపుడు**
- అర్ధంతరంగా విద్యుత్ సరఫరా నిలిపివేత
- బిల్లు కట్టినా కరెంటు ఎప్పుడొస్తుందో తెలియని వైనం
- కుటీర పరిశ్రమల చిరు వ్యాపారుల అవస్థలు

బుచ్చెయ్యపేట : స్మార్ట్ మీటర్లు వల్ల కుటీర పరిశ్రమలు ద్వారా ఉపాధి పొందేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ బిల్లు కట్టలేదని గడువు ఇవ్వకుండా అర్ధంతరంగా విద్యుత్ నిలిపివేయడంతో కుటీర పరిశ్రమపై ఆధారపడి కుల వృత్తి చేసుకుని జీవించేవారు తీవ్రంగా నష్టపోతున్నారు. మేజర్ పంచాయతీ వడ్డాదికి చెందిన గోపాసిన మురళి కార్పెంటర్ పని చేసుకుని జీవిస్తున్నాడు. కుర్చీలు, బెంచీలు, మంచాలు ఇతర పనిముట్లు తయారు చేసుకుని కుల వృత్తి చేసుకుంటున్నాడు. నెల రోజుల కిందట ఇతని షాపులో పాత విద్యుత్ మీటర్ తొలగించి కొత్తగా స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేశారు. నెల రోజులు దాటడంతో 7వ తేదీన ఉదయం స్మార్ట్ మీటర్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అర్ధంతరంగా కరెంట్ పోవడంతో విద్యుత్‌శాఖ అధికారులకు షరాబు మురళి ఫిర్యాదు చేశాడు. గతంలో రూ.500 నుంచి రూ.800 వరకు విద్యుత్ బిల్లు వచ్చేదని, స్మార్ట్ మీటర్ బిగించగా ఈ నెల రూ, 1,778 బిల్లు వచ్చిందని, అర్ధంతరంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఫిర్యాదు చేశాడు. పాత మీటర్ బిల్లు కట్టకపోయినా గడువు ఉండేదని స్మార్ట్ మీటర్‌కి నెల రోజులకి తప్పనిసరిగా విద్యుత్ బిల్లు చెల్లించాలని, లేకపోతే దానంతట అదే ఆగిపోతుందని విద్యుత్ సిబ్బంది తెలిపారు. నెల రోజులకు ఒక గంట కూడా అదనంగా కరెంట్ రాదని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. దీంతో బాధితుడు మురళి అప్పు చేసి 8వ తేదీన ఒంటి గంటకు అదనపు రుసుం రూ.100 కలిపి రూ, 1,878 బిల్లు చెల్లించాడు. విద్యుత్ బిల్లు కట్టి ఒక రోజు గడిచినా కరెంట్ సరఫరా రాలేదు. విద్యుత్‌శాఖ సిబ్బందిని కలిసి కట్టిన బిల్లు చూపించి విద్యుత్ సరఫరా ఇవ్వాలని బాధితుడు మురళి కోరాడు. స్మార్ట్ మీటర్‌కు కరెంట్ ఆపడం, ఇవ్వడం మా చేతిలో లేదని ఆటోమేటిక్‌గా కరెంట్ సప్లయ్ వస్తుందని అప్పటి వరకు వేచి ఉండాలని విద్యుత్ సిబ్బంది తెలిపారు. మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేక మురళి చేతి వృత్తి పని చేసుకోకుండా ఖాళీగా ఉండిపోయాడు. గతంలో నెల రోజులు దాటినా కరెంట్ ఉండేదని, ఇపుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల తన లాంటి చేతి వృత్తులు చేసుకునేవారికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయాడు. అతనిలాగే ఇదే గ్రామానికి చెందిన గిడుతూరి ఈశ్వరరావుకు కరెంట్ సరఫరా ఆగిపోవడంతో అతను ఆవేదన చెందుతున్నాడు.

సామాన్యులకు ఇవేం తిప్పలు



తాతల కాలం నుంచి కులవృత్తి చేసుకుని జీవిస్తున్నాం. నెల రోజుల కిందట మా షాపులో స్మార్ట్ మీటర్ బిగించారు. నెల దాటి ఒక్క రోజుకే కరెంట్ సరఫరా ఆగిపోయింది. కనీసం మెసేజ్ కూడా రాలేదు. నాలాంటి చదువుకోలేని వారికి, కుల వృత్తి చేసుకునే వారికి నెల రోజులు గుర్తు పెట్టుకోవడం ఎలా అవుతుంది. స్మార్ట్ మీటర్ వల్ల వెయ్యి రూపాయలు అదనపు బిల్లుతో పాటు వంద రూపాయలు పెనాల్టీ కట్టాను. మూడురోజులుగా విద్యుత్ సరఫరా లేదు. ఇలా అయితే కుటీర పరిశ్రమలపై ఆధారపడ్డ మేం ఎలా పనిచేసుకుని జీవించాలి.

– గోపాసిన మురళి, షరాబు వడ్డాది

రేపు 16 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం : ఈ నెల 11న మూడు ఫీడర్ల పరిధిలో 16 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్‌శాఖ నర్సీపట్నం ఈఈ అప్పారావు బుధవారం తెలిపారు. మాకవరపాలెంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి సరఫరాకు అంతరాయం లేకుండా చెట్ల కొమ్మలు తొలగించనున్నట్టు చెప్పారు. మాకవరపాలెం, శెట్టిపాలెం, ధర్మసాగరం ఫీడర్ల పరిధిలో గల మాకవరపాలెం, తామరం, రాచపల్లి జంక్షన్, అవంతి కళాశాల, కొత్తపాలెం, కొండలఅగ్రహారం, లచ్చన్నపాలెం, దాలింపేట, జి.గంగవరం, సీతన్నఅగ్రహారం, వజ్రగడ, కృష్ణాపురం, శ్రీరాంపురం, తమ్మయ్యపాలెం, చంద్రయ్యపాలెం, మల్లవరం, ఎం.నగరం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు.

దేవరాపల్లి: దేవరాపల్లి మండల వ్యాప్తంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈఈ కె.శంకరరావు తెలిపారు. చీడిపల్లి ఏబీ స్విచ్ నుంచి దేవరాపల్లి వరకు, దేవరాపల్లి నుంచి ఆనందపురం వరకు 33 కేవీ లైన్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మండలంలోని బోయిలకింతాడ, తారువ, దేవరాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ఉండదన్నారు.

రోలుగుంట: నర్సీపట్నం, రోలుగుంట మండలాల్లో పలు గ్రామాల్లో ఈ నెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నర్సీపట్నం విద్యుత్ ఈఈ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నం మండలం ధర్మసాగరం, అన్నవరం, యండపల్లి, వజ్రగడ, తమ్మపాలెం, రోలుగుంట మండలంలో రోలుగుంట, కొమరవోలు, కె.నాయుడుపాలెం, అడ్డసరం, శరభవరం, కొంతలం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ కోత ఉంటుందని తెలిపారు.

నాతవరం : మండలంలో ఈనెల 11వ తేదీన నాతవరంలో గల 33 కేవీ విద్యుత్‌లైను మరమ్మతుల నిమిత్తం నర్సీపట్నం విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు అప్పారావు ఆదేశాలు మేరకు విద్యుత్ నిలుపుదల చేస్తామని మండల ఏఈ చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నేడు పేరెంట్స్ టీచర్ సమావేశం

కె.కోటపాడు : కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మెగా పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం అందించినట్టు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సమావేశానికి ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

మాడుగుల రూరల్: మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ సమావేశాలు నిర్వహించాలని, ఎంఈవోలు బి. దేముడమ్మ, పాందురంగారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సారథ్యంలో ఎంపీపీ, యు.పి. హైస్కూలు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

జన సురక్షా పథకాలపై అవగాహన



గొండుపాలెంలో జన సురక్షా పథకాలపై వివరిస్తున్న బ్యాంక్ మేనేజర్ శ్రావణ్‌బాబు, వికాస్

కె.కోటపాడు : బ్యాంక్‌లో ఖాతా కలిగిన 18 ఏళ్ల పైబడిన వారు తప్పకుండా జన సురక్షా పథకాల్లో చేరాలని చౌడువాడ ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ కె.శ్రావణ్‌బాబు అన్నారు. గొండుపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి ఖాతాదారులకు జన సురక్షా పథకంలో అమలు చేస్తున్న పీఎం సురక్షా బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా పథకం, అటల్ పెన్షన్ యోజన పథకాలపై అవగాహన కల్పించారు. ఏడాదికి రూ.20 ప్రీమియం నగదును చెల్లించిన ఖాతాదారులకు పీఎం సురక్షా బీమా యోజన పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఏడాది కాలంలో 70 ఏళ్ల వయస్సు గల వారు ప్రమాదాల బారిన పడి మరణించిన సమయాల్లో వారి కుటుంబాలకు బ్యాంక్ ద్వారా రూ.2లక్షలు లభిస్తుందని, అలాగే పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ద్వారా ఏడాదికి రూ.436 చెల్లిస్తే 50 ఏళ్లలోపు వారికి ప్రమాదవశాత్తూ లేదా సహజ మరణం వాటిల్లినా వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు అందుతుందన్నారు. అటల్ పెన్షన్ యోజన పథకంలో 18 నుంచి 39 ఏళ్ల వయస్సు గల వారు అర్హులన్నారు. ఈ పథకంలో వయస్సును అనుసరించి నెలవారీ ప్రీమియం చెల్లించిన వారికి 60 ఏళ్లు నిండిన తరువాత నెలనెలా పింఛను లభిస్తుందన్నారు.

పచ్చిమేతతో పశువుల్లో అధిక పాల దిగుబడి



రైతులకు వివరిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్

కె.కోటపాడు : పశు పోషణలో పశుగ్రాసం రైతులు శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయడంతో మంచి దిగుబడిని సాధించవచ్చునని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ఈ.దినేష్‌కుమార్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమాన్ని పురస్కరించుకొని సింగన్నదొరపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో పశుగ్రాసం వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. ఐదు నుంచి ఆరు లీటర్ల పాలు ఇచ్చే పశువులకు దాణాను ఇవ్వకుండా కేవలం పచ్చగడ్డిని ఇవ్వడం ద్వారానే పెంచవచ్చునని తెలిపారు. పచ్చిమేతలతో విటమిన్-ఎ ఎక్కువగా ఉండడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు పాల దిగుబడి పెరగడంతో పాటు సకాలంలో ఎదకు వస్తాయని తెలిపారు. పశువైద్య సిబ్బంది మనీషా, ప్రవీణ్ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: పశువులకు మేలైన పోషణ అందించడానికి మొక్కజొన్న, జొన్న, ఆలసందలు, పిల్లిపెసర వంటివి పెంచుకోవాలని మాడుగుల ఏరియా పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా కె.జె.పురంలో బుధవారం రైతులకు పంట పొలాల్లో క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. కె. వల్లాపురం పశువైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ పశువైద్యశాలల ద్వారా కాకిజొన్న విత్తనాలు 5 కిలోలు సబ్సిడీ పోను రూ.115 చెల్లించాలన్నారు. మొక్కజొన్న, జొన్న, ఆలసందల, హైబ్రిడ్ నేపియర్, పిల్లిపెసర వంటి వాటిని పెంచుకోవాలన్నారు.

వెయ్యి ఓట్లు దాటితే అదనపు పోలింగ్ బూత్

నర్సీపట్నం : వెయ్యి ఓట్లు దాటితే అదనంగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తామని ఆర్డీవో వి.వి.రమణ పేర్కొన్నారు. ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాల్లో తప్పు, ఒప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీ నాయకులు ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏకా శివ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరమణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కింతలి పాలసొసైటీ అధ్యక్షుడిగా చెల్లయ్యదొర



కింతలి పాలసొసైటీ అధ్యక్షులు చెల్లయ్యదొరను అభినందిస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్

మాడుగుల రూరల్ : మండలంలో కింతలి పాలసొసైటీ అధ్యక్షుడిగా సలాది చెల్లయ్యదొరను సొసైటీ డైరెక్టర్లు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ను బుధవారం సాయంత్రం పెందుర్తిలో మర్యాదపూర్వకంగా కలిసారు. చెల్లయ్యదొరను ఆయన శాలువతో సన్మానించి అభినందించారు.

గుండె వ్యాధుల వైద్య శిబిరానికి విశేష స్పందన

రావికమతం : మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉచిత గుండె వ్యాధుల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బుచ్చియ్యపేట మండలం పొట్టిదొరపాలెం చెందిన ఉత్తమ సంఘ సేవిక అవార్డు గ్రహీత వి.ఎస్.ఆర్ ట్రస్ట్ అధినేత వడ్డి సత్యారావు , స్థానిక స్టార్ వన్ లోన్స్ ఎండీ పులగాయల గోవింద అధ్వర్యంలో రావికమతంలో ఉచిత గుండె వ్యాధుల వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరానికి సీనియర్ సీటిజన్‌లు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారికి ఎన్ఆర్ఐ ఆస్పత్రి కార్డియాలజిస్ట్ సుజిత్‌కుమార్ నాయుడు 2డి ఈకో ,ఈసీజీ వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నేడు

దేవరాపల్లి : వైఎస్సార్‌సీపీ మాడుగుల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని దేవరాపల్లి మండలం తారువలో గురువారం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తెలిపారు. తారువలోని వైఎస్సార్ ఆడిటోరియంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ రాజకీయ వ్యవహారాల సలహా కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి హాజరవుతారన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీశ్రేణులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పార్టీ శ్రేణులంతా హాజరుకావాలి

మాడుగుల : దేవరాపల్లి మండలం తారువాలో వైఎస్ఆర్ ఆడిటోరియంలో మాడుగుల నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ విస్తృత స్థాయి సమావేశం గురువారం జరగనుందని ఎంపీపీ, మాజీ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, రామధర్మజ తెలిపారు. ఈ సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు జరగనుందన్నారు. కార్యక్రమానికి మండలంలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీకి శ్రీరామ్మూర్తి సేవలు ఎనలేనివి



శ్రీరామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : సింగన్నదొరపాలెంలో వైఎస్సార్‌సీపీ పటిష్టతకు నారపాటి శ్రీరామ్మూర్తి చేసిన కృషి ఎనలేదని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల సలహా సభ్యుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నారపాటి శ్రీరామ్మూర్తి సంతాప కార్యక్రమాన్ని ఆయన కుటుంబ సభ్యులు బుధవారం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌లు శ్రీరామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు రొంగలి వెంకటరమణ, లాలం నాని, లెక్కల సూర్యనారాయణ, శ్రీకాంత్ శ్రీను, బోశం కృష్ణారావు, లెక్కల శంకరరావు, ఎంపీటీసీలు రొంగలి లక్ష్మి, ఏటుకూరి రాజేష్, ఆకుల సాయి ప్రసాద్ హాజరయ్యారు.

మురుగునీటి నిల్వతో ఇబ్బందులు



యాతపేటలో డ్రైనేజీలో నిల్వ ఉండిపోయిన మురుగునీరు

కె.కోటపాడు : ఎ.కోడూరు యాతపేటలో ఇటీవల నిర్మాణం చేపట్టిన రెండు డ్రెయినేజీ కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండడం వల్ల తీవ్ర దుర్గంధం వ్యాపించి స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామానికి చెందిన శెట్టి శ్రీనివాసరావు, శెట్టి తేజ తెలిపారు. దిగువ యాత పేటలోను, యాతపేటలో గల రచ్చబండ వీధిలో రెండు డ్రెయినేజీలను చేపట్టగా వీటి నిర్మాణాల సమయంలో లెవెలింగ్ పనులు చేయకపోవడంతో కాలువల్లో మురుగునీరు పల్లానికి ప్రవహించడం లేదన్నారు. ఈ డ్రెయినేజీలపై పలకలు కూడా వేయకపోవడంతో ఈ మార్గంలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే చిన్నారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. డ్రెయినేజీల సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు, తేజ కోరారు.

నేటి నుంచి కొత్తపెంటలో చతుర్మాస మహావ్రతం

దేవరాపల్లి : కొత్తపెంటలోని సద్గురు దేవానంద సరస్వతీ స్వామీజి ఆశ్రమంలో గురువారం ఆషాడ పౌర్ణమి నుంచి చాతుర్మాస్య మహావ్రతాన్ని ఘనంగా ప్రారంభించనున్నారు. నవంబర్ 5 (కార్తీక పౌర్ణమి) వరకు సుమారు మూడు నెలల పాటు కొనసాగుతుందన్నారు. సద్గురు దేవానంద స్వామీజీ వారి 25వ పుణ్యతిథి రజోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సద్గురు దేవానంద స్వామీజి దివ్య జీవన్ ట్రస్టు సభ్యులు, సర్పంచ్ రొంగలి వెంకటరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కార్మికులు, ప్రజాసంఘాల బంద్ ప్రశాంతం



చోడవరంలో కార్మిక సంఘాల నాయకుల ర్యాలీ



మాడుగులలో నిరసన ర్యాలీ



రావికమతంలో ఆందోళన చేస్తున్న కార్మికులు



రావికమతంలో మానవహారం

చోడవరం: కార్మిక సంఘాలు చేపట్టిన బంద్ చోడవరంలో బుధవారం ప్రశాంతంగా జరిగింది. దేశవ్యాప్త బంద్‌లో భాగంగా చోడవరం పట్టణంలో రాస్తారోకో, ర్యాలీ నిర్వహించారు. వ్యాపార సంస్థలు, వివిధ ప్రభుత్వ శాఖలకు బంద్‌కు సహకరించాలని సీఐటీయు ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు కోరడంతో పలువురు స్వచ్ఛంగా సహకరించారు. ఎల్ఐసి, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన నిర్వహకులతోపాటు వివిధ శాఖలో పనిచేస్తున్న కార్మికులు పెద్దసంఖ్యలో ఈ బంద్‌లో పాల్గొన్నారు. కార్మికులకు అన్యాయం జరిగే విధంగా కార్మిక చట్టాలు రూపొందించి అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ కార్మిక సంఘాల నాయకుల ధ్వజమెత్తారు. కాలేజీ జంక్షన్ నుంచి పాతబస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా నిరసన ర్యాలీని కొత్తూరు జంక్షన్ వరకూ చేశారు. అక్కడ మానవహారం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బంద్ కారణంగా కొన్ని బస్సు సర్వీసులు కూడా రద్దు చేశారు. ఎల్ఐసీ ఏజెంట్లు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఆశ వర్కర్లతోపాటు వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు తమ విధులను బహిష్కరించారు. సీఐ అప్పలరాజు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏపీ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, సీఐటీయు జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, ఎస్వీ నాయుడు, ఆశ వర్కర్ల సంఘం రామలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.


రావికమతం : మండల కేంద్రంలో వివిధ రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు,మూఠా కార్మికులు, వీవోలు,మధ్యాహ్నం శానిటైజర్ వర్కర్లు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. నాలుగు కూడలి రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయు మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్య దర్శి సత్యవేణి, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షురాలు అమ్మాజీ, పుష్ప, ధనంజయరావు, కె.గోవింద పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

బుచ్చెయ్యపేట : ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి అసంఘటిత కార్మికులకు న్యాయం చేయాలని పలు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని నిరసన తెలిపారు. వడ్డాది విద్యుత్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.

మాడుగుల : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగులేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయు నాయకుడు ఇరటా నరసింహమూర్తి, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కె.భవానీ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బస్టాండ్‌లో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నిరసన ర్యాలీలో పాల్గొని వారు మాట్లాడారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, స్కీమ్ కార్మికులకు నెలకు రూ 26 వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నుంచి ఆర్.రామలక్ష్మి, ఎల్.వరలక్ష్మి, ఆశా యూనియన్ నుంచి కె.లక్ష్మి, పి.ప్రసన్న లక్ష్మి, కోఆపరేటివ్ బ్యాంకు నుంచి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ లక్ష్మణరావు, బోరా ఈశ్వరరావు, తూరుబిల్లి సత్యనారాయణ, పంచాయతీ కార్మికులు యూనియన్ నుంచి అప్పారావు, శానిటేషన్ వర్కర్ల నుంచి రవి, బోరా మహాలక్ష్మి పాల్గొన్నారు.

దేవరాపల్లి: దేవరాపల్లిలో ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన ర్యాలీని చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న, సీఐటీయూ మండల కార్యదర్శి కె.నూరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీటీ దొర మాట్లాడుతూ లేబర్ కోడ్‌ను తక్షణమే రద్దు చేయాలని, బిల్డింగ్, ముఠా, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, స్కీమ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఎన్.కనకారావు, బాబూరావు, అంగన్‌వాడీ ప్రతినిధులు పద్మ, కన్నతల్లి, కోమలి, ఆశా వర్కర్ల యూనియన్ సభ్యులు పద్మ, కమల, ఈశ్వరమ్మ, జ్యోతి, కృష్ణవేణి, ఐకేపీ ప్రతినిధులు జి. రాము, సృజన, టి. అప్పారావు, గిరిజన సంఘం నాయకులు సిహెచ్. లక్ష్మణ, రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.




మాకవరపాలెంలో ఆశ, అంగన్‌వాడీల నిరసన

రోలుగుంట : సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం రోలుగుంటలో ప్రైవేటు లారీ డ్రైవర్లు, అంగన్‌వాడీలు, ఆశాలు నిరసన ర్యాలీలు జరిపారు. తమకు కనీస వేతనాలు ఇవ్వాలని, స్కీము వర్కర్లకి ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. బజారు రోడ్డు కూడలిలో మానవహారం నిర్వహించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు చిరంజీవి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాలు పాల్గొన్నారు.

నాతవరం : కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి అన్ని వర్గాల ప్రజలు సంఘటితం కావాలని సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు కె.ప్రసన్న అన్నారు. మండల కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు జీడి కార్మికులు ఆందదోళన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి మెయిన్‌రోడ్డుపై నిరసన ర్యాలీ జరిపారు. వినతి పత్రాన్ని తహసీల్దార్ వేణుగోపాల్‌కు అందజేశారు. యూనియన్ నాయకులు సత్యవతి, వసంత, రాజేశ్వరి, వరలక్ష్మి లక్ష్మిబాయి, రామలక్ష్మి పాల్గొన్నారు.

మాకవరపాలెం : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రైమరీ స్కూల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. అకనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల నాయకులు మహాలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.


కె.కోటపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త సమ్మెను చేపట్టడం జరిగిందని సీపీఎం నాయకుడు యర్రా దేముడు అన్నారు. కె.కోటపాడులో బుధవారం దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా నిరసన కార్యక్రమం చేపట్టారు.



దేవరాపల్లిలో నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు వెంకన్న, దొర తదితరులు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల ఆందోళన



రోలుగుంటలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్ల మానవహారం